క్లుప్తంగా

పిల్లల భద్రత అందరి బాధ్యత

సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పిల్లల భద్రత మనందరి బాధ్యత అని సీపీ అనురాధ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండగ సెలవుల దృష్ట్యా పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. చెరువులు, కుంటలు, బావుల వద్ద పిల్లలను ఈతకు పంపకూడదని, విద్యుత్ వైర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు.

అతివేగం ప్రమాదకరం: సీఐ



వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటకమాన్: అతివేగంతో వాహనాలు నడపడం ప్రమాదకరమని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాజీవ్ రహదారి కరీంనగర్ రోడ్డు ఇబ్రహీంనగర్ శివారులో పయనిస్తున్న వాహనాల వేగాన్ని స్పీడ్ లేజర్‌గన్ సహాయంతో శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు వాహనదారులు సహకరించాలన్నారు. అతివేగంగా వెళ్తున్న వంద మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. వేగంగా వెళ్లే వాహనాలను స్పీడ్ లేజర్ గన్‌తో గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్పీడ్ లేజర్‌గన్ ఆపరేటర్ కానిస్టేబుల్ జగదీశ్వర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

దుబ్బాకరూరల్: మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీ శనివారం నిర్వహించారు. అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ హాజరయ్యారు. 2023–2024 సంవత్సరంలో జరిగిన పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లను, పంచాయతీ కార్యదర్శులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో అవకతవకలు జరిగినట్టు ఆయన గుర్తించారు. 30 గ్రామ పంచాయతీల్లో సరిగా పనిచేయని జీపీలకు రూ.78 వేలు జరిమానా, రూ.48వేలు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్‌కు విద్యార్థి ఎంపిక

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన గీతా ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి చేపూరి సాత్విక్ శర్మ అండర్14 రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేటలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అండర్ 14 విద్యార్థులు 100 మందికి శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించగా సాత్విక్ ప్రతిభ కనబరిచాడని, జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఆదివారం జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టులో పాల్గొంటాడని తెలిపారు.

స్టాఫ్ క్లబ్ సెక్రటరీగా సత్యనారాయణ



సత్యనారాయణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హుస్నాబాద్: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ చెన్నూరి గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్టాఫ్ క్లబ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. సెక్రటరీగా సుదగోని సత్యనారాయణ, కోశాధికారిగా వి.రజని ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కళాశాల అభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రిన్సిపాల్ రూ.5వేలు, సిబ్బంది రూ.22,500, మొత్తం రూ.27,500 విరాళాలు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగాధర్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి స్వచ్ఛందంగా విరాళాలు ప్రకటించడం అభినందనీయమన్నారు. అధ్యాపకులు ఎస్‌ఎస్‌రాజు, సదాశివ్, ఎల్లయ్య, విద్యాసాగర్, రణధీర్ కుమార్ తదితరులు ఉన్నారు.

రైతు సేవా కేంద్రం పరిశీలన

దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలోని బాలాజీ రైతుసేవా కేంద్రాన్ని దుబ్బాక డివిజన్ ఏడీఏ కాంపాటి మల్లయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుగుల మందుల డీలర్లు ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లు విధిగా నిర్వహించాలని సూచించారు. పాడైన, నకిలీ విత్తనాలను అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈఓ సంతోష్, డీలర్ సత్యం ఉన్నారు.

అన్నపూర్ణ అవతారంలో దుర్గామాత

దసరా నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. దుర్గామాత శనివారం అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. మండపాలు, ఆలయాల వద్ద భక్తులు ఒడి బియ్యం, కుంకుమాభిషేకాలు నిర్వహించారు. పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పారాయణాన్ని పఠించారు. వివిధ రకాల వంటకాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.



కొండపాక(గజ్వేల్): అన్నపూర్ణామాతగా దర్శమిస్తున్న అమ్మవారు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నర్సాపూర్ చౌరస్తాలో అమ్మవారి ప్రతిమ



మద్దూరు(హుస్నాబాద్): పోలీసు అధికారులను సన్మానిస్తున్న నిర్వాహకులు



బెజ్జంకి(సిద్దిపేట): అన్నపూర్ణ అవతారంలో..



సిద్దిపేటకమాన్: పూజలల్లో పాల్గొన్న సతీశ్



నంగునూరు(సిద్దిపేట): అమ్మవారికి నైవేద్యాలు



చిన్నకోడూరు(సిద్దిపేట): అమ్మవారికి పూజలు

బంగారు బొమ్మా.. దొరికేనమ్మో..

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం ఆయా పట్టణ కేంద్రాలు, గ్రామాలు, వాడ వాడలా జరిగిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు సందడిగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థినులు, అధ్యాపకులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి 'బంగారు బొమ్మా.. దొరికేనమ్మో..' అంటూ ఆట పాటలతో సంబరాలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు





హుస్నాబాద్: బాలికల జూనియర్ కళాశాలలో..



సిద్దిపేటకమాన్: బతుకమ్మలతో జడ్జిలు సాయిరమాదేవి, చందన, శ్రావణి తదితరులు

బతుకమ్మ, బోనాలు తెలంగాణ చరిత్రను తెలియచేస్తాయి

బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

మద్దూరు(హుస్నాబాద్): బతుకమ్మ, బోనాల పండుగలు తెలంగాణ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేస్తాయని బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గాగిల్లాపూర్‌లోని కాళీమాత ఆశ్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు, నిర్వాహకులు ఆమెను సన్మానించి అమ్మవారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలను పూజించే పండుగ బతుకమ్మ అని, ఈ పండుగ కేవలం తెలంగాణలో మాత్రమే చేసుకోవడం మన అదృష్టం అన్నారు. యువత డ్రగ్స్, గంజాయిలాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ సంజీవ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌గౌడ్, కనకచంద్రం, శ్రీశైలం, మల్లేశం గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న బాలలక్ష్మి



కోహెడ(హుస్నాబాద్): బతుకమ్మ ఆడుతున్న మంత్రి ప్రభాకర్ సతీమణి మంజుల



చిన్నకోడూరు(సిద్దిపేట): బతుకమ్మలతో విద్యార్థినులు



గజ్వేల్‌రూరల్: జీపీపీ ఆర్టీసీ డిపోలో..

ఉద్యమకారులకు మార్గదర్శి వెంకటస్వామి

చైర్ పర్సన్ రజిత



నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ రజిత అధ్యక్షతన మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యమకారులకు వెంకటస్వామి మార్గదర్శకులుగా ఉండేవారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయాల్లో ఒక ప్రత్యేకతను, గుర్తింపును పొందారని, నేటి యువ రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అలాగే అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెంకటస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు నళినీదేవి, పద్మ, సరోజన, కో ఆప్షన్ సభ్యులు శంకర్ రెడ్డి, అయూబ్, మాజీ ఎంపీపీ వెంకట్, పీసీసీ సభ్యుడు లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు రవీందర్, హస్సేన్ తదితరులు ఉన్నారు.

సీడర్ వినియోగంతో ఖర్చు తక్కువ

అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్



మొక్కజొన్న విత్తడాన్ని పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: విత్తనాలను విత్తుకోవడానికి కూలీలకు బదులుగా సీడర్‌లను వినియోగించడం వల్ల సమయం ఆదాతో పాటు ఖర్చు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి బి.శ్రీనాథ్ సూచించారు. మండలంలోని ఎన్సాన్‌పల్లిలో ఏట్ల రమేశ్ తన పొలంలో మ్యానువల్ సీడర్‌తో మొక్కజొన్న విత్తుకోవడాన్ని శనివారం ఏఓ పరిశీలించారు. అనంతరం తడ్కపల్లిలో వరి పొలాలను పరిశీలించారు. వరికి ఆకు ఎండు తెగులు సోకినట్టు గుర్తించి నివారణ చర్యలను సూచించారు. పైరుకు అగ్రిమైసిన్ 0.4గ్రా, ప్లాంటోమైసిన్ 0.2గ్రా 5నుంచి 7రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకుంటే తెగులును అరికట్టవచ్చని చెప్పారు. ఆయన వెంట ఎన్సాన్‌పల్లి క్లస్టర్ ఏఈఓ నవనీత ఉన్నారు.

లక్ష్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న సతీశ్

సిద్దిపేటజోన్: విద్యార్థులు తమ లక్ష్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ సతీశ్ పిలుపునిచ్చారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన పద్మశాలి విద్యార్థులకు స్థానిక పాపా భవన్‌లో శనివారం నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో పదో తరగతి విద్యార్థులకు రూ.8వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.10.వేలు సాయం అందజేస్తున్నామన్నారు. దాతలు చక్రపాణి, బాలకృష్ణ, లక్ష్మయ్య, మల్లేశంను సన్మానించారు. డా.వలకోల దేవేందర్, కృష్ణదయాసాగర్, శ్రీనివాస్, భిక్షపతి, శ్రీశైలం, రవి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కొండపాక(గజ్వేల్): యువతి అదృశ్యమైన ఘటన కుకునూరుపల్లి మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మాత్‌పల్లి గ్రామానికి చెందిన చేరుపల్లి రాజలింగంకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు రాజేశ్వరి చదువు అనంతరం ఇంటి వద్దే ఉంటోంది. గతనెల 22న రాజలింగం వైద్య పరీక్షల నిమిత్తం భార్యతో కలిసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా చిన్న కూతురు, కుమారుడు పొలం వద్దకు వెళ్లారు. ఇద్దరూ పొలం పనులు ముగించుకొని ఇంటికి వచ్చేసరికి రాజేశ్వరి కనిపించలేదు. తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో యువకుడు ..



సత్యనారాయణ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు ఆచూకీ తెలియకుండా పోయాడు. మండల పరిధిలోని గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం గ్రామానికి చెందిన తిప్పబోయిన సత్యనారాయణ శుక్రవారం భార్యతో గొడవపడ్డాడు. అతను ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. అతడి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నవోదయలో 'బ్యాగ్‌లెస్ డే'

వర్గల్(గజ్వేల్): నవోదయ విద్యాలయలో 'బ్యాగ్‌లెస్ డే' కొనసాగుతోంది. చదువుకు విరామం ఇచ్చి శనివారం విద్యార్థులు క్రీడలు, చిత్రకళ, కుట్టుశిక్షణ, వాయి ద్య సాధనలో మునిగిపోయారు. ఐదురోజుల పాటు బ్యాగ్‌లెస్ డే కార్యక్రమం కొనసాగుతుందని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



తరుణ్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అందెలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ బోయిని పరశురాములు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సూకూరి నాగరాజు–రాణి దంపతుల ఏకైక కుమారుడు తరుణ్(19) సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. పలు చోట్ల చికిత్స చేయించుకున్నా ఫలితం లేక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 28న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తరుణ్ మృతి చెందాడు. తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా తన వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, మాజీ సర్పంచ్ చుక్క శంకర్ తదితరులు ఉన్నారు.

మరో మహిళ..

జగదేవ్‌పూర్(గజ్వేల్): అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన ఓ మహిళ పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన కాంబ్లే బాలమణి(48) తన భర్త, కొడుకుతో అక్కడే ఉంటుంది. ఇటీవల క్యాన్సర్‌కు గురికాగా మూడు నెలల క్రితం తన అమ్మమ్మ ఊరైన మండలంలోని మునిగడపకు వచ్చింది. చికిత్స పొందుతున్నా నయం కాకపోవడంతో తీవ్ర మానస్థాపనికి గురై శుక్రవారం అమ్మమ్మ పొలం వద్ద పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వారు ఆమెను సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

రూరల్ సీఐ శ్రీను



రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

సిద్దిపేటరూరల్/హుస్నాబాద్: రౌడీ షీటర్లు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ సత్ప్రవర్తనతో మెలగాలని రూరల్ సీఐ శ్రీను పిలుపునిచ్చారు. శనివారం ఆయన రౌడీ షీటర్లుకు తన కార్యాలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలిగే వారికి పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నిరంతరం నిఘా కొనసాగుతుందని, మళ్లీ నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అపూర్వ రెడ్డి, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌లోని ఆర్‌బీ గార్డెన్‌లో అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకలకు సీఐ కొండ్ర శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత యేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

దుబ్బాక టౌన్/మర్కూక్(గజ్వేల్): ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ గోనెపల్లి దేవలక్ష్మీసంజీవరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని చెల్లపూర్ 2వ వార్డుకు చెందిన రాజయ్యకు మంజూరైన రూ.60వేల చెక్కును శనివారం ఆమె వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. రవి, నర్సింహులు, రాజు, దుర్గయ్య ఆమె వెంట ఉన్నారు. మర్కూక్ మండలంలోని వరదరాజ్‌పూర్ గ్రామానికి చెందిన చందనకు మంజూరైన చెక్కును కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కనకయ్య గౌడ్ బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు

◆ సీఎంను కలిసిన చక్రధర్‌గౌడ్

సిద్దిపేటకమాన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో శనివారం సిద్దిపేట కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. తాను వివరించిన సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు చక్రధర్‌గౌడ్ తెలిపారు.

◆ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలు ఉద్యమించాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలను సందర్శిస్తూ పాదయాత్రలు చేపడతామన్నారు. కార్యక్రమంలో స్వామి, యాదగిరి, రమేష్, సుమన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ వారిని గౌరవించడం మన బాధ్యత

కొండపాక(గజ్వేల్): పారిశుద్ధ్య కార్మికులను గౌరవించుకోవడం ప్రజాప్రతినిధులు బాధ్యతగా గుర్తించాలని మాజీ సర్పంచ్ బోడపట్ల ఐలం సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్, బొబ్బాయిపల్లి, కుకునూరుపల్లి గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్మికులకు సొంత ఖర్చులతో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని బట్టలను పంపిణీ చేశారు. పండుగల సందర్భంగా వారికి ప్రభుత్వం ప్యాకేజీని అందించాలని కోరారు.

◆ జనని సీడ్స్‌తో అధిక లాభాలు

దుబ్బాకటౌన్: జననీ సీడ్స్ సంస్థ ఆకాశ్ బీజీ పత్తి విత్తనాలతో అధిక దిగుబడులు పొందవచ్చని ఆ సంస్థ జోనల్ మేనేజర్ పూల శివ కోటేశ్వరరావు అన్నారు. రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో శనివారం రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. సుమారు 500 మంది రైతులు తరలివచ్చి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాశ్ పత్తి పచ్చదోమ, తెల్లదోమ నుంచి తట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం ఎంపిక

హుస్నాబాద్: భారతీయ కిసాన్ సంఘ్ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. బీకేఎస్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండలశాఖ అధ్యక్షుడిగా జనగామ సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కవ్వ ఆదిరెడ్డి, ఉపాధ్యక్షులుగా చీరాల వెంకటేశ్వర్ రావు, అనుమల రాజిరెడ్డి తదితరులను ఎంపిక చేశారు.

◆ మునిగడపలో చోరీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): తాళం వేసి ఉన్న ఇంట్లో నుంచి తులం బంగారంతో పాటు రూ.40వేల నగదును అపహరించిన ఘటన మండలంలోని మునిగడపలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మునిగడపకు చెందిన తలారి సాయిలు కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి చేర్యాల మండలం మద్రిముస్త్యాలలో బంధువుల దశదినకర్మకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించారు. బీరువాలోని తులం బంగారంతో పాటు రూ.40వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని ఇంటిని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

◆ విద్యుదాఘాతంతో ఆవు మృతి

కొండపాక(గజ్వేల్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ పాడిఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన మండలంలోని ఖమ్మంపల్లిలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తోటకూరి మల్లేశం రోజూలాగానే తన పశువులను మేత కోసం వదిలాడు. పొలం వద్ద ఉన్న విద్యుత్తు స్తంభానికి ఉన్న సపోర్టు తీగకు ప్రమాదవ శాత్తు తగిలి ఒక ఆవు మృతి చెందింది. రైతు మల్లేశం విద్యుత్శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఆవు విలువ రూ.1.20లక్షలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

◆ బీజేపీ సభ్యత్వ నమోదు

సిద్దిపేటజోన్: స్థానిక వెంకటేశ్వర దేవాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదును రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. సభ్యత్వ అభియాన్‌లో భాగంగా ప్రతి బూత్‌లో 200 కొత్తగా సభ్యులను పార్టీలో చేర్పించాలని సూచించారు.